# ఆశాజ్యోతి

"దిగులు పడబోకండి. వెంటనే యింకొకర్ని పెళ్ళిచేసుకోండి"

ఆ 'వెంటనే' ప్రారంభం ఎప్పుడు?

అనసూయకు తెలుసు. నాకూ తెలుసు. ఆమె కావాలనే – తన స్థితి తెలుసుకునే ఆవిడది వాడింది. మరి నేను? తెలుసుకొని నమ్మలేక – కాదు, నమ్మటానికి యిష్టం లేక –

"అనసూయా! అలాంటి మాటలు అనకు, డాక్టరుగారు నీకు ఏమీ ఫరవాలేదన్నారు" అన్నాను.

అనసూయ నా చేతుల్లోనే – ఆ రాత్రే జీవితం చాలించింది. తను మరణించక ముందు ఆమె పడిన వేదనా – బాధా తన్ను గురించి కాదు. నా గురించి – నా క్షేమాన్ని, ఆనందాన్ని గురించి.

ఐదు సంవత్సరాల మా యిద్దరి దాంపత్య జీవితంలో ఒకళ్ళని గురించి ఒకళ్ళకు బాగా తెలుసు. అద్దంలో చూసుకొని నా ముఖాన్ని నేను గుర్తించుకోలేని దశ రావచ్చునేమో కాని – ఆమెను మాత్రం – ఛాయగా మాత్రమే చూడగలిగినా గుర్తించగలడు.

తిరిగి వివాహం చేసుకోగూడదనే నిర్ణయం తరవాత నాలుగు నిండు సంవత్సరాలు నాలో బాగా పనిచేసింది. ఆ నాలుగు సంవత్సరాల్లో కూడా అప్పుడప్పుడు – అందమైన స్త్రీలనుగాని యువదంపతుల్నిగాని చూసినప్పుడు 'వెంటనే యింకొకర్ని పెళ్లి చేసుకోండి' అన్న అనసూయ సలహా, ఆజ్ఞ నాకు తిరిగి తిరిగి జ్ఞప్తికి వస్తుండేది.

ఆ రోజున రైలుకు యింకా అరగంట టైము వుందనగానే ప్రయాణ సన్నాహం ప్రారంభించాను. తల దువ్వుకుంటూ అద్దంలో మామూలుగా ముఖం చూసుకున్నాను. తక్కిన జుట్టు నుంచి ప్రత్యేకంగా వేరుపడిన రెండు తెల్ల వెంట్రుకలు నన్ను హఠాత్తుగా ఆకర్షించినై.

ఆ రెండూ ఆ రాత్రి వున్నట్టుండి పుట్టుకొచ్చినవి మాత్రం కాదు. అన్నిటితోపాటు అవీ రెండు మూడంగుళాల పొడువున్నై.

మరి నా దృష్టిని ఎందుకు ఆకర్షించినై?

పెద్దవాడి వౌతున్నావురా కుర్రోడా! పెళ్ళి! అయితే యిప్పుడు – లేకపోతే ఎప్పటికీ...

నా శరీరం జలదరించింది. నిజంగా పెద్దవాణ్ణి అయిపోతున్నానా? పెళ్లి! అయితే ఇప్పుడు – లేకపోతే ఎప్పటికీ...

ఆ మాటను చాలాసార్లు మననం చేశాను స్వగతంగా – ప్రకాశంగా కూడా –

"యిప్పుడు లేకపోతే ఎప్పటికీ లేకపోవటమేంటోయ్! రాత్రి పది గంటలకు ప్యాసింజరుంటే" అంటూ శాస్త్రి గదిలోకి వస్తూ అనేసరికి నేను కంగారుపడ్డాను.

రెండు గుర్రపు బళ్ల నుంచీ, ఒక రెండెడ్ల బండి నుంచీ శరీరాన్ని కొద్ది దెబ్బల్తో కాపాడుకొని స్టేషనుకు చేరాను. అయితే లేకపోతే.... బుర్ర వేడెక్కిపోతోంది.

ప్లాట్‌ఫారం మీద... అంతా ఓ నూతన ప్రపంచం!

ఇదివరక్కూడా నేను అందాన్ని చూడలేని, ఆనందించలేని అంధుణ్ణి కాదు. కాని అనసూయ నా నుంచి దూరమైనాక ఎంత అందమైన స్త్రీని చూసినా నాలో ఏ భావమూ – ఎట్టి వికారమూ కలిగేది కాదు. 'అందమైన స్త్రీ' అని మాత్రం అనుకునేవాడిని.

నాలో కొత్త నెత్తురు, కొత్త జీవం – ఏదో అనిర్వచనీయమైన, అతి మధురమైన ఆహ్లాదం కదలసాగింది. నా కళ్ళు పరిసరాలను పరిశీలించసాగినై. స్త్రీ, పురుషులు కలగాపులగంగా వున్న ఆ ప్రదేశంలో – ప్రత్యేకం ఆడవాళ్లను వేరుపరిచి నా నేత్రాలు నా మనస్సుకు తెలియచెపుతున్నై.

సన్నం, లావు, పొడుగు, పొట్టి.....

బొమ్మల దుకాణం కాదు యిష్టం వచ్చిన బొమ్మను కొనేయటానికి అంటోంది నా యింగిత జ్ఞానం.

పదిహేను పదహారు సంవత్సరాల యీడుగల ఓ అమ్మాయి ఏవో పుస్తకాలు చేత్తో పట్టుకొని గేటు పక్కన నిలబడి వుంది.

చూశాను. పరిశీలనా దృష్టుల్తో మళ్ళీ మళ్ళీ చూశాను.

ఉహూ! పనికిరాదు. కనీసం పదకొండు సంవత్సరాలైనా మా యిద్దరి మధ్యా తేడా వుంటుంది.

యింకా చాలామందిని పరిశీలించాను. అందరూ నా కన్న పది సంవత్సరాలు పెద్దవాళ్లో చిన్నవాళ్లో మాత్రంగా కనిపించారు. నా కన్న నాలుగైదు సంవత్సరాలు తక్కువ వయసు వాళ్లు అని భావించిన ఒకరిద్దరు స్త్రీల పక్కన వాళ్ళ భర్తలో, బంధువులో ఉండటంవల్ల నా మనస్సు తన వికారాన్ని కొంత హద్దులో వుంచుకొంది.

ఇరవై మూడు యిరవై నాలుగు సంవత్సరాల యువతి అయితే నా వయస్సుకు సరిపోతుంది. నా క్కాబోయే భార్య మధ్య, నా మధ్య ఎక్కువ తేడా వుండగూడదు. మరి అంత వయస్సు వొచ్చే వరకు ఏ స్త్రీ యీనాటి సమాజంలో పెళ్లిచేసుకోకుండా నా కోసం వుంటుంది?

బాల వితంతువులూ, లేడీ డాక్టర్లూ, నర్సులూ – యింకా యింకా నేను ఆలోచించాను. లేడీ డాక్టర్ని చేసుకునే తాహతు (ఆర్థికంగా) నాకు లేదు. నర్సులు పెళ్ళి చేసుకోరు. ఇక మిగిలిందల్లా వితంతువులు?

కొంచెం ఖాళీగావున్న కంపార్టుమెంటులో ఎక్కి కూర్చున్నాను. నాకు ఎదురుగా యీ పక్కన ఆ పక్కన అన్నీ మీసాలు, చొక్కాలు, క్రాపులు. రైల్లో కూడా యింకా ఆడవాళ్ళ పెట్టెలు, మొగవాళ్ళ పెట్టెలు. ఛీ! తెల్ల ప్రభుత్వం! కాదు నల్ల ప్రభుత్వం అనే గుర్తుకొచ్చి నాలుక కొరుక్కున్నాను. ఫస్టు బెల్ కొట్టారు. యిక బండి కొద్దిసేపట్లో కదులుతుంది. యిక పొరపాటున కూడా నేను కూర్చున్న

పెట్టెలోకి ఆడవాళ్ళు ఎక్కరు. నిరాశతో, నిస్పృహతో కిటికీలోనుంచి తల బయటకు పెట్టి ప్లాట్‌ఫారం పొడుగునా చూశాను.

అదృష్టదేవత వెన్ను చరిచినట్లయింది. అన్ని పెట్టెలూ వదిలేసి ఒక స్త్రీ నాలుగైదు సంవత్సరాల వయసుగల ఆడపిల్లను ఒక చేత్తో, సంచీని మరోచేత్తో పట్టుకొని సరిగా నేను కూర్చున్న పెట్టె వేపుకే వస్తోంది.

కాలితో తలుపును పక్కకు నెట్టాను. అదృష్టదేవతనైనా మనం ఆహ్వానించవలసి వుంటుంది. రాకపోతే వెంటపడి తరిమి పట్టుకోవలసి వుంటుంది.

ఆమె సరిగ్గా నేను కూర్చున్న పెట్టె దగ్గరకు వచ్చేసరికి గార్డు విజిల్ వేశాడు - పెళ్ళిళ్ళ పేరయ్య! ఆ మహనీయుణ్ని ఏ రైలు ప్రమాదంలోనూ చిక్కుకోకుండా కాపాడమని యీశ్వరుణ్ని ప్రార్థించాను.

"రైలు కదలబోతోంది. ఎక్కేసేయండి!"

"ఆడవాళ్ళ పెట్టె...."

ఆమె తటపటాయిస్తూ అటూ యిటూ చూసే లోపల ఆమె చేతిలోని బాలికను లోపలకు లాగేశాను.

కడ్డీ పట్టుకొని పైకి ఎక్కబోతూ ఆమె నా వంక ఒక్కసారిగా తన నిండు కళ్ళతో చూసింది.

కదిలేది రైలా లేక నా శరీరమా? ఏదో లోకాల్లోకి రోజుకు ఎనిమిది గంటల పని, చాలీ చాలని జీతం - మురికి చొక్కాలు, మాసిన గడ్డం - యివేవీ లేని మరో ప్రపంచానికి నా మనస్సు దూసుకుపోయింది.

రైలు వేగంగా పోతోంది. ఆధ్యాత్మికుణ్నీ, అతివాస్తవికుణ్నీ కాకపోవటంవల్ల తొందర్లోనే నా మనస్సు తిరిగి యీ భూ ప్రపంచంలోకి వచ్చింది.

ఆమె నా పక్కనే కూర్చుని వుంది. కాని మా యిద్దరి మధ్య ఆ బాలిక అటూ యిటూ కదులుతూ ఆమెను 'అమ్మా!' అంటూ ఏవో ప్రశ్నలు వేస్తోంది.

మెడ మాత్రం పక్కకు తిప్పి ఆమె వంక చూశాను. కిటికీలోగుండా తలపెట్టి దూరాన కదిలే చెట్ల వంకా, చేల వంకా ఆమె చూస్తోంది.

కెరటాలు కెరటాల్లా వున్న ఆమె శిరోజాల మీది నుంచి నా దృష్టిని క్రమక్రమంగా మెడ మీదకు తీసుకువచ్చాను. మెరుపుతీగెలాగా - సన్నగా - నున్నగా వున్న ఆమె మెడ మీద నక్షత్రాకారంలో వున్న ఒకే ఒక పుట్టుమచ్చ!

వెతకబోయిన తీగ కాలికి తగిలిందా? ఆడబోయిన తీర్థం ఎదురైందా? రొట్టె విరిగి నేతిలో పడిందా?

నాలుగు సంవత్సరాలు నిద్రాణమైవున్న నా జాతీయత్వం మేల్కొన్నది. నా మనోనేత్రానికి అనసూయ ప్రత్యక్షమైంది. గాలి తాకిడికి చెల్లాచెదురుగా మొఖం మీది పడిన జుట్టులోనుంచి రెండు తెల్లవెంట్రుకలు - 'అయితే యిప్పుడు లేకపోతే ఎప్పటికీ....' అంటున్నై.

వితంతువుకు సహజమైన నమ్రతతో - సిగ్గుతో - బెరుకుతో ఆమె అటు తిరిగి కూర్చుని వుంది. పెద్దమనిషికి అవసరమైన శాంతాన్నీ, సంకోచాన్నీ విడవలేక ఇటు తిరిగి నేను కూర్చున్నాను.

రైలు పోతూనే వుంది. స్టేషను దగ్గర అది ఆగినప్పుడల్లా నా గుండె కూడా ఆగిపోతూ వుండేది. యీ స్టేషన్లో ఆమె దిగిపోదు గదా?

దేవుడిలోని దైవత్వాన్నీ, దేవతల్లోని దేవత్వాన్నీ ఎన్నడూ నేను నమ్మలేదు. చిన్నపిల్లల్లో దైవత్వం వుంటుందని మావూరి స్వాములవారు అంటూ వుండేవాడు. అదీ నేను నమ్మలేదు.

అసలు వాళ్ళు చెప్పే సామ్యాల్లోని, విశేషణాల్లోని పేలవాన్ని యిప్పుడు నేను గ్రహించాను. అసలు చిన్నపిల్లలందరూ దేవుళ్ళు - దేవతలూను!

నా చిట్టిదేవత మా యిద్దరికి ఎంత చక్కగా సంభాషణ కలిపింది!

"అమ్మా! మనం ఎప్పుడు దిగుదామే?" - తియ్యని చిట్టిదేవత ప్రశ్న.

"గుంటూరు స్టేషను రాగానే" - ఆ రతీదేవి జవాబు.

ఆ ప్రశ్న వేసినందుకు ఆ బాలికను అమాంతం ఎత్తుకుని ముద్దుపెట్టుకుందామనుకున్నాను.

నా సంశయ నివృత్తి కలిగింది. ఇద్దరం దిగవలసినచోటు వొకటే.

దేవతలు వరం యివ్వటమే కష్టం. కాని వొకసారి యిచ్చారో - అక్కడినుంచి వద్దన్నా - ఆకాశగంగలాగా మన మీద వరాలు కురిపిస్తారు.

చిన్ని చేతుల్ని కిటికీలోగుండా పోనిచ్చి -

"నాకు బిస్కత్తులు కావాలే అమ్మా!" అంటూ తల్లిని అడిగింది.

"మనం అక్కడికి వెళ్ళి వచ్చేటప్పటికి బండి పోతుంది. గుంటూరులో కొనిపెడతాలే!" ఆమె లాలించింది.

మానవుల్లో - ముఖ్యంగా మొగవాళ్లలో యిలాంటి సందర్భాల్లో చొరవా, ధైర్యసాహసాలు హఠాత్తుగా పుట్టుకొస్తుంటై. అమాంతం ఆ చిట్టిపాపను ఎత్తుకొని కిందకు దిగాను.

బిస్కట్లూ, తిమ్మిరి బిళ్ళలూ, ఒక బొమ్మల పత్రికా కొని తిరిగి బయలుదేరాను. నేను ఎక్కవలసిన పెట్టె యింకా ఐదారు గజాలు వుందనగా బండి కదిలింది.

ఆమె ఆదుర్దాగా తలుపు దగ్గరకు వచ్చింది.

నేను చిట్టిని అందించాను. నన్ను నేను మరచిపోయేటంత ఆనందం, ఆవేశం నాలో ఒక క్షణకాలం గిర్రున తిరిగింది. నా చేతిని తాకింది ఆమె చేతి వ్రేలా, చీర చెరగా? ఏదో నేను చెప్పలేను - ఊహించలేను.

"ఇన్ని కొన్నారెందుకు?"

ఆమె అన్న యీ మాట చిట్టికి సగం - నాకు సగం.

"భార్యా బిడ్డలు లేనివాణ్ణి, పిల్లలంటే నాకు ప్రేమ" - అర్ధస్వగతంలో అనేశాను.

యీపాటికి ఆమెకు నేను (పురుష) వితంతువుననీ - పిల్లలంటే ప్రేమ అనీ తెలిసి వుండాలి. దెబ్బకు రెండు పిట్టలు.

ఆ నా మాటల్లో నేను ఊహించనంత వశీకరణ శక్తి వుందనుకుంటాను. ఆమె కొంచెం ధైర్యంగా, అర్ధనిమీలిత నేత్రాలతో అప్పుడప్పుడు నా వంక చూడసాగింది.

నేను మాత్రం ఎర్రగా, గుండ్రంగావున్న ఆమె ముఖం మీది నుంచి నా దృష్టిని చెదర నివ్వలేదు.

తోటి ప్రయాణీకులు యీ నాటకాన్ని గమనిస్తున్నారా? వాళ్లు ఏమి చేసినా, ఏమనుకుంటున్నా నాకు ఫరవాలేదు. యిది వాళ్ళకు సంబంధంలేనిది! అసలు తెర ముందు కాదు.

గుంటూరులో యిద్దరం దిగాం.

స్టేషను దాటే లోపల ఆమె కనీసం నాలుగైదుసార్లు వెనక్కు తిరిగి నా వంక చూడనట్టుగా చూసింది. నేను మాత్రం వీపు కాచుకొనే వున్నాను. నఖశిఖ పర్యంతం ఎప్పుడూ ఆమె నా కళ్ళల్లో వుండవలసిందే!

రిక్షా ఎక్కుతూ ఆమె వెనక్కు తిరిగి నా వైపుకు చూచిన చూపు ఆ భంగిమం! రవివర్మ దురదృష్టవంతుడు! శకుంతల అదృష్టవంతురాలు!

బరువెక్కిన హృదయంతో నేను మరో రిక్షాలో బయలుదేరాను. వాస్తవికత తన ప్రభావాన్ని తిరిగి నా మీద ప్రయోగించసాగింది. ఆమె ఎక్కడికి వెళుతోంది? అది ఎవరి ఇల్లు అయివుంటుంది? పఠాన్లూ, ఘూర్ఖాలూ వాకిళ్ళలో కత్తులతో కావిలి కాచే కొంప కాదుగదా!

పెద్ద రోడ్డు దాటి పక్కన వున్న చిన్న బజార్లగుండా రిక్షాలు పోయినై.

తరువాత గల్లీలు, చిన్న గొందులు....

ఇది కలగాదు. యదార్థం! రాత్రి కాదు. పగలు! కావాలంటే తారీఖూ, వారం, వర్జం, నక్షత్రం – అన్నీ పంచాంగంలో వున్నదానికంటే కూడా ఖచ్చితంగా చెప్పగలను. అయినా 'యిది' అనలేని ఏదో 'యిది' నన్ను మైకంలో ముంచెత్తుతోంది. నన్ను నేనే మరిచిపోయే స్థితి కన్పిస్తోంది.

సరిగ్గా నేను అద్దెకున్న యింటివైపుకే ఆమె ఎక్కిన రిక్షా పోతోంది. అందగాడుగా నా కున్న కీర్తిని – గుమాస్తాగా నా కున్న గొప్పతనాన్నీ యిదివరకే తెలుసుకొని – సరాసరి నాతో కాపరం పెట్టి వెయ్యటానికి రావటం లేదుగదా? ఆదిదేవా! అనసూయా! అష్టదిగ్గజాల్లారా!

'కిర్ర్' మంటూ నంబరు యిరవై తలుపు దగ్గర ఆమె రిక్షా ఆగింది.

'కిర్ర్ర్' అంటూ నంబరు యిరవై వొకటి తలుపు దగ్గర నా రిక్షా ఆగింది.

చెవ్వి లేకుండా తాళం తీయటానికి ప్రయత్నిస్తూ నేను వాకిట్లో నిలబడ్డాను.

"నిన్ననే వస్తానని రాసి యివ్వాళ వచ్చావేమమ్మా?" అంటూ మాయింటి యజమానురాలు శాంతమ్మగారు ఆమె చేయి పట్టుకొని లోపలకు తీసుకుపోతోంది.

"అమ్మమ్మా!" అంటూ చిట్టి శాంతమ్మగారి రెండో చేయి పట్టుకుని వేళ్ళాడుతోంది.

ఆమె నా మీద నిండు రెండు నక్షత్రాల కాంతిని ప్రసరింపజేసింది. ఆరడుగుల పై చిల్లర ఎత్తువున్న ద్వారబంధం నా తలకు ఠక్కున తగిలింది. శరీరం గాలి కంటే తేలికయినట్టుగా వుంది.

ఎక్కడో గ్రామఫోను రికార్డు 'మొహబత్ – షాదీ' అంటూ ధ్వనిస్తోంది.

నిద్రమత్తు దేవతలు యింకా పూలవర్షం కురిపించటం ప్రారంభించలేదు.

❀ ❀ ❀

మనస్సంతా పిచ్చిపిచ్చిగా వుంది. మామూలు కంటె ముందుగా పొద్దుగూకిందనిపించింది.

ఆమె రెండు గంటల ముందు నా వంక చూసిన చూపు ప్రభావం క్రమక్రమంగా నా మీద పని చెయ్యటం తగ్గింది. మరొక్కమారు ఆమెను చూచే అవకాశం కలిగితే..యీ రాత్రిని మాత్రం ఎందుకు వృథా కానివ్వాలి?

పెరటిలోకి రెండుమూడు సార్లు తిరిగాను. బావి చుట్టూ, దడి మీదగా – ఎన్నిసార్లు చూశానో? ఎన్నిమార్లు తిరిగానో లెక్కించటం కష్టం.

ఏవో మధుర స్వప్నాలను జాగ్రదావస్థలోనే అనుభవిస్తూ మంచం మీద పడుకున్నాను. నేను పడుకున్న గదినీ, ఆమె వున్న యింటినీ కలుపుతూవున్న తలుపుకు నా వేపున వున్న గడియ తీసేశాను. ఆ స్వర్గద్వారాన్ని ఏ నడిరాత్రి వేళో, తెల్లవారుఝామునో – ఎప్పుడో ఒకప్పుడు వీలును బట్టి ఆ దేవత యిట్టే తెరిచి నా గదిలోకి ప్రవేశించవచ్చు!

ఏ మాత్రం శబ్దం అయినా ఆమె తలుపు తెరుస్తున్నట్టుగా భావించి ఆ వైపుకు దృష్టిని పోనిచ్చే వాడిని. ఊహూఁ! అది ఏ ఎలుకో, చుంచో అయి వుండేది. అసలు నేను నా వైపున గడియ తీసివుంచానని ఆమెకు తెలిసేదెలా?

నిశ్శబ్దంగా మంచం మీది నుంచి లేచి ఆ తలుపు మీద రెండుసార్లు చేత్తో కొట్టాను. లైన్ క్లియర్. యిదంతా ఓ దేవభాష. ఆ భాష ఏ రెండు ఒకే జాతి హృదయాలకూ అర్థం కాదు. రెండు విభిన్న జాతుల హృదయాలకు మాత్రమే అవగాహన అవుతుంది.

“ఏమిటండీ తలుపు మీద గట్టిగా కొట్టిన శబ్దమైంది? మీరున్నారా?”

నా పేరు పెట్టి శాంతమ్మగారు గట్టిగా పిలిచింది. ఆమెకు దొంగల భయం జాస్తి.

ధైర్యంగా నాలుగడుగులు వెనక్కు వేశాను.

కూతురు పలకరించరాదూ = అమ్మ పలకరించక పోతే!

“ఎలుకలెండి! దెబ్బకు చంపేశాను”

శాంతమ్మగారు ఎలుకను చూపించమనదుగదా? ఆమె అదో విచిత్రమైన వ్యక్తి!

“మంచిపని చేశారు, మహాగోలగా వుంది”

అవసరమైన యిలాంటి సర్టిఫికెట్లు యివ్వకపోతే మంచి పని చేశారు. మా అమ్మాయిని పెళ్ళిచేసుకో మనరాదూ? ‘ఆ త్యాగం’ ఆ రోజులు అన్నీ గతించినై.

తిరిగి మంచాన్ని ఆశ్రయించాను. ఆమె కనపడపోతే పోయె కనీసం మాటలన్నా వినపడితే – సంభాషణ ప్రారంభమైంది. మందర స్థాయిలో.

“ఆయన ఏమి చేస్తుంటారు?” వీణా నాదాన్ని తోసిరాజనగల మాధుర్యమైన ధ్వనిని ఏమంటారు?

“తాలూకాలో గుమాస్తాగిరీ”

తరవాత మళ్ళీ ఆమె ఏదో ప్రశ్నించింది. యిక అన్నీ తల్లి జవాబులు.

“పెళ్ళాం బిడ్డల్లేరు. అద్దె ఖచ్చితంగా ఇస్తుంటాడు. దుబారా ఖర్చుచేసే మనిషి, పై తిరుగుళ్ళు

జూదం"

"అబద్ధం! అసత్యం" అని గట్టిగా అరుద్దామనుకున్నాను.

పెళ్ళాం బిడ్డలు లేని వాడంటే ఎంత తేలిక!

ఇక ఆ రాత్రి నాకు నిదర పట్టలేదు. శాంతమ్మగారు కాదు కారణం. ఆమె నా మీద అన్ని అబద్ధాలు చెప్పిన తరవాత ఆ రాత్రి ఆ తలుపు తెరుచుకుంటుందని నాకు ఆశ లేదు. కాని దింపుడు కళ్ళెం లాటరీగా లేక ఏ సదుద్దేశం గల దేవుడైనా ఆమెకు అన్నీ అబద్ధాలని చెపుతాడనే ఆశతో ఆ గడియ అలాగే తీసి వుంచాను.

తెల్లవారింది.

శాంతమ్మ చుట్టాన్ని చూసేందుకు మరో పేటకు వెళ్ళటం చూసి ఆమెను యింట్లోనే పట్టుకున్నాను.

"రాత్రి మీ అమ్మ నన్ను గురించి చెప్పినదంతా అబద్ధం!"

"నాకు తెలుసు"

"ఎలా?"

"ఆ గొంతుక. ఆమె వుపయోగించిన మాటలు"

ఆమె మాట పూర్తి కాకుండానే, "అయితే మనం ఎప్పుడు పెళ్ళిచేసుకుందాం?" - అర్థమయేందుకు అధికారంతో అడిగేశాను.

ఆమె తల తిప్పుకొన్నది. ఏవో మాటలు, ఏవో భావాలు ఆమెలో సుడులు తిరిగి వుంటయ్. తుపాను రేపి వుంటయ్!

"నేను మీకు భార్యను కాలేను. కాని ఎప్పటికైనా ఎవ్వరికైనా భార్యనయ్యే అదృష్టమే నాకు వుంటే, అది మీకే!"

తరవాత కళ్ళ నీళ్ళతో, నేలను బొటనవేలితో రాస్తూ ఆమె చాలా చెప్పింది.

అవన్నీ యిప్పుడు నాకు సరిగా గుర్తులేవు.

అత్తగారి యిల్లు - ఆస్తీ, తన కూతురు క్షేమం, మామా వాళ్ళు దావావేస్తే తన కూతురుకు ఆస్తి రాకుండా పోవటం - అన్నీ యిలాంటివివే! సాంఘిక న్యాయశాస్త్రాన్ని అర్థశాస్త్రంతో ముడిపెట్టి - నీతి శాస్త్రం మినహా....

తిరిగి గదికి చేరాను. యిక ఆ రోజల్లా బయటికి రాలేదు. క్రిందటి రాత్రి ఆమె తెరిచేందుకు వీలుగా తీసివుంచిన తలుపు గడియ వేసేశాను.

ఆ రాత్రి ఏమాలోచించాను? ఎంతసేపు ఆలోచించాను? అదంతా నరకం?

మరుసటి రోజు ఆఫీసులో, "ఏమోయ్! తలంతా ఒక్కసారి తెల్లబడిపోయింది" అని మా హెడ్‌క్లర్కు అడిగినప్పుడు - "పెద్దవాణ్ణి అయిపోవటం లేదటండీ!" అన్నాను.

ఇక అదే రక్షణ! అదే ఆశాజ్యోతి!

*

*(రేరాణి మాసపత్రిక : జనవరి, 1949)*